సంపుటి :02 సంచిక :61 పేజీలు :07

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

వెల ₹5




శనివారం 19, ఏప్రిల్ 2025

## కాషాయ సైనికుడు ఛత్రపతి వారసుడు

- సవాళ్లను ధిక్కరిస్తూ ఒక్కో మెట్టు..
- ఏబీవీపీ, బీజేవైఎంలో క్రియాశీలక పాత్ర
- పార్టీ అగ్రనేతలతోనూ సన్నిహిత సంబంధాలు
- యువనేతగా గుర్తింపు తెచ్చుకున్న హన్మకొండ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి లాడె శివ
- నగరంలో ప్రముఖ విద్యాసంస్థల్లో భాగస్వామి..
- నిరుపేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూత
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై గురి
- శాయంపేట నుంచి జెడ్పీటీసీగా బరిలోకి దిగేందుకు రెడీ

» 06



## గులాబీ గుబులు

### రజతోత్సవ సభపై నీలినీడలు!

బీఆర్ఎస్ రజతోత్సవ సభ గులాబీ దళంలో గుబులు రేపుతోందా ? సభపై ఆపార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల్లోనూ ఉత్సాహం సన్నగిల్లిందా ? జనం నాడిని ముందే తెలుసుకొని వాళ్లపై వాళ్లే నమ్మకాన్ని కోల్పోయి సైలెంట్ అయ్యారా? అంటే గులాబీ పార్టీలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలు నిజమే అన్న సంకేతాలు పంపుతున్నాయి. ఈ క్రమంలోనే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని అధినేత కేసీఆర్ నిన్న తన ఫాంహౌస్‌లో నిర్వహించి న కీలక సమావేశానికి జిల్లాకు చెందిన ముగ్గురు ముఖ్య నేతలు డుమ్మా కొట్టడం ఆరోపణలకు మరింత బలం చేకూర్చింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య గైర్హాజర్ అవడం జిల్లా రాజకీయాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. మరోపక్క.. రివ్యూ మీటింగ్‌కు అసలు ఎర్రబెల్లికి పిలుపు లేదని, ఆయన వస్తే తాము రాలేమంటూ ఉమ్మడి జిల్లా నేతలు కొందరు భీష్మించారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈపరిణామాలతో రజతోత్సవ సభ విజయవంతం అవుతుందా..? లేదా ? అన్న అనుమానాలు పార్టీ నేతలు, శ్రేణుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. - అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

- తూతూమంత్రంగా సన్నాహక సమావేశాలు
- ముఖ్య నేతల్లోనూ సన్నగిల్లిన ఉత్సాహం
- ఎవరికీ వారే అన్న తీరున ఉమ్మడి జిల్లా నాయకులు

» 02

- ఇంత వరకూ వరంగల్‌కురాని హరీష్‌రావు, కేటీఆర్..
- నిన్న ఫాంహౌస్‌లో అధినేత కేసీఆర్ రివ్యూ మీటింగ్
- ఎర్రబెల్లి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజయ్య డుమ్మా..
- పార్టీ శ్రేణులను గందరగోళానికి గురిచేస్తున్న పరిణామాలు



## ఎవరెవరి పాత్ర ఎంత?

- ఇసుక అక్రమ రవాణాపై లోతుగా నిఘా విభాగాల ఆరా
- హెల్ప్ చేస్తున్న శాఖలు, అధికారులెవరు అనే అంశంపై సమాచార సేకరణ
- అధికారుల తీరుపై ఎమ్మెల్యే జీఎస్సార్ సీరియస్
- ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ఆదేశాలు
- చర్చనీయమైన 'అక్షరదర్బార్' కథనాలు

» 06

## భూభారతితో సమస్యలు పరిష్కారం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

» 03






### హరీష్‌రావు కంటతడి

తండ్రి చనిపోయిన విద్యార్థిని వేదనకు చలించిన మాజీ మంత్రి

» 03

## పేషెంట్ కు రూ.10 వేలు !

- సర్కార్ దవాఖానలో ఆరుబయటే తూతూమంత్రంగా ప్రథమ చికిత్స
- రోగులను భయపెడుతూ ప్రైవేట్ హాస్పిటళ్లకు తరలింపు
- పరకాల ప్రభుత్వ ఆస్పత్రిలో నయా దందా
- ఠాగూర్ సినిమా సీన్లు ఇక్కడ నిత్యకృత్యం
- అధికారుల తీరుపై మండిపడుతున్న పేషెంట్ల బంధువులు

» 04

108 అంబులెన్స్ డ్రైవర్‌కు కమిషన్
ప్రభుత్వ వైద్యులతో ప్రైవేట్ దవాఖానల కుమ్మక్కు !



దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకున్నట్లు పరకాలలోని ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్లు, సిబ్బంది కుమ్మక్కై పేద, మధ్య తరగతి ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులను, వారి బంధువులను భయభ్రాంతులకు గురిచేస్తూ పథకం ప్రకారం ప్రైవేట్ దవాఖానలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 108 అంబులెన్స్ డ్రైవర్‌తో ఈ దందా సాగిస్తున్నారు. ఒక్కో పేషెంట్‌కు ప్రైవేట్ దవాఖానలు అంబులెన్స్ డ్రైవర్‌కు రూ. 10 వేలు కమిషన్ ఇస్తున్నట్లు సమాచారం. వచ్చిన కమిషన్‌లో ప్రభుత్వ దవాఖాన సిబ్బందికి వాటా పంచుతున్నట్లు రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే.. ఈ దందా మొత్తం ప్రభుత్వ దవాఖాన వైద్యుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఠాగూర్ సినిమాలోని సన్నివేశం పరకాల ప్రభుత్వ ఆస్పత్రిలో నిత్యకృత్యం అయిందనే టాక్ వినిపిస్తోంది.

- అక్షర దర్బార్, పరకాల



ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను శనివారం తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు ఆపార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. - అక్షర దర్బార్, పరకాల

# గర్భిణులు ఒత్తిడికి దూరంగా ఉండాలి

**- జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి..**

అక్షర దర్బార్, చిట్యాల : గర్భిణులు మానసిక ఒత్తిడిలకు గురికాకుండా సమతుల్యమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిస్తారని జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి అన్నారు. శనివారం చిట్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ..



అంగన్వాడీ సెంటర్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు గర్భం ధరించినప్పటి నుండి వెయ్యి రోజుల వరకు తీసుకోవాల్సిన 6 ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జయశ్రీ, తహసీల్దార్ హేమ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని ప్లాస్టిక్ కవర్ల్ వస్తువులు వాడితే జరిగే అనర్థాల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం ముగ్గురు గర్భిణులకు సీమంతాలు, ఇద్దరు పిల్లలకు అన్నప్రాసన, ఐదుగురు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఏపీఎం మంజుల, సూపర్వైజర్ మాధవి పాల్గొన్నారు.





నడికూడ మండలంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండలంలోని నర్సక్కపల్లి, చర్లపల్లి, నార్లపూర్ గ్రామాల్లో శనివారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, సమన్వయ సమితి సభ్యులు పర్నేం మల్లారెడ్డి, ఏపీఎం రమాదేవి, నర్సక్కపల్లి మాజీ ఎంపిటిసి బుర్ర దీప దేవేందర్ గౌడ్, యం. స్వరూప, ప్రవళిక, లావణ్య, సీసీ కుమారస్వామి పాల్గొన్నారు.

### ఆత్మకూర్ మండలంలో..

అక్షర దర్బార్ ఆత్మకూర్ : ఆత్మకూరు మండలంలోని పెంచికలపేట, బ్రాహ్మణపల్లి, అగ్రంపహాడ్, కటాక్షపురం గ్రామాల్లో శనివారం ఐకేపీ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ మార్కెట్ చైర్మన్ బీరం సునంధ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఆత్మకూర్ మండలంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

## పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం


అక్షరదర్బార్, వరంగల్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మట్టెవాడ పోలీసులు ప్రజల భాగస్వామ్యంతో పోలీస్ స్టేషన్ ఎదురుగా చలివేంద్రం, మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరంగల్ ఏసీబీ నందిరాం నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్ఐ విఠల్ తదితరులు పాల్గొన్నారు




# గులాబీ గుబులు

## రజతోత్సవ సభపై నీలినీడలు!

- తూతూమంత్రంగా సన్నాహక సమావేశాలు
- ముఖ్య నేతల్లోనూ సన్నగిల్లిన ఉత్సాహం
- ఎవరికీ వారే అన్న తీరున ఉమ్మడి జిల్లా నాయకులు
- ఇంత వరకూ వరంగల్‌కురాని హరీష్‌రావు, కేటీఆర్..
- నిన్న ఫాంహౌస్‌లో అధినేత కేసీఆర్ రివ్యూ మీటింగ్
- ఎర్రబెల్లి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజయ్య డుమ్మా..
- పార్టీ శ్రేణులను గందరగోళానికి గురిచేస్తున్న పరిణామాలు




అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: బీఆర్ఎస్ రజతోత్సవ సభ గులాబీ దళంలో గుబులు రేపుతోందా ? సభపై ఆపార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల్లోనూ ఉత్సాహం సన్నగిల్లిందా ? జనం నాడిని ముందే తెలుసుకొని వాళ్లపై వాళ్లే నమ్మకాన్ని కోల్పోయి సైలెంట్ అయ్యారా? అంటే గులాబీ పార్టీలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలు నిజమే అన్న సంకేతాలు పంపుతున్నాయి. ఈ క్రమంలోనే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని అధినేత కేసీఆర్ నిన్న తన ఫాంహౌస్‌లో నిర్వహించిన కీలక సమావేశానికి జిల్లాకు చెందిన ముగ్గురు ముఖ్య నేతలు డుమ్మా కొట్టడం ఆరోపణలకు మరింత బలం చేకూర్చింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య గైర్హాజర్ అవడం జిల్లా రాజకీయాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. మరోపక్క.. రివ్యూ మీటింగ్‌కు అసలు ఎర్రబెల్లికి పిలుపులేదని, ఆయన వస్తే తాము రాలేమం టూ ఉమ్మడి జిల్లా నేతలు కొందరు భీష్మించారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈపరిణామాలతో రజతోత్సవ సభ విజయవంతం అవుతుందా..? లేదా ? అన్న అనుమానాలు పార్టీ నేతలు, శ్రేణుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

### సభ స్థలంలోనూ గందరగోళం

2001 ఏప్రిల్ 27న పురుడుపోసుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి కాలక్రమేణ భారత రాష్ట్ర సమితిగా అవతరించిన సంగతి తెలిసిందే. 24 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకొని ఈనెల 27న 25వ ఏట అడుగుపెడుతోంది. ఈ పాతికేళ్ల పండుగను అత్యంత ఘనంగా సెలబ్రేట్ చేయాలని, 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ ఘనంగా నిర్వహించి సక్సెస్ చేయాలని కేసీఆర్ గట్టి పట్టుదలతో ఉన్నారు. వరంగల్, హన్మకొండ పరిసర ప్రాంతాల్లో సభ నిర్వహించాలని అధినేత తొలుత నిర్ణయించారు. ఇందుకోసం జిల్లాకు చెందిన ముఖ్య నేతలు అనువైన ప్రాంతాలను పరిశీలించారు. ఆ తర్వాత సభను రంగారెడ్డి జిల్లాలో నిర్వహించాలని భావించారు. ఎట్టకేలకు హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో సభకు ప్లాన్ చేసి ఆ బాధ్యతలను హరీశ్‌రావుకు అప్పగించారు కేసీఆర్.

### ఎర్రబెల్లి కలకలం..

**ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం పాలకుర్తి నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన సన్నాహక సభలో మాజీ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడిన మాటలు సర్వత్రా వైరల్ అవుతున్నాయి. ఆ పార్టీ శ్రేణులను కలవరానికి గురిచేస్తున్నాయి. జనాలు ఏ స్థాయిలో వస్తారో తెలువని పరిస్థితి ఉందని, గతంలో సభలు సమావేశాలకు జనాన్ని సమీకరించడానికి మనిషికి 300 ఇచ్చేదని, ఇప్పుడు ప్రతిపక్షంగా ఆ పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నట్లుగా కొన్ని గ్రూపుల్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. రజతోత్సవ సభ చారిత్రాత్మకంగా నిలిచిపోవాలని, లక్షలాది మంది జనాన్ని తరలించాలని ఒకపక్క కేసీఆర్ పిలుపు నిస్తున్నారు, కానీ ఎర్రబెల్లిలో నిరాశ వాదా దృక్పథం ఆయన మాటలద్వారా తేటతెల్ల మైందని, నైరాష్యం కూడా ఎర్రబెల్లిని ఆవరించే బలహీనంగా మాట్లాడుతున్నారనే అనే టాక్ నడుస్తోంది. రజతోత్సవ సభ రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొస్తుందని ఆపార్టీ నేతలు చెబుతుండగా, రజతోత్సవ మహాసభ గులాబీ పార్టీ ఏ మేరు సత్ఫలితాలు తీసుకొస్తుందో వేచిచూడాలి.**

### హరీష్‌రావు, కేటీఆర్ జాడేది ?

**వరంగల్‌లోనే మకాం వేస్తానని చెప్పిన హరీశ్ రావు ఇంత వరకు సభా నిర్వహణ ప్రాంతానికిగానీ, వరంగల్ నగరానికిగాని రానే రాలేదట. హరీశ్ రావు ఒక్కసారిగా రజతోత్సవ సభా నిర్వహణ బాధ్యతల నుంచి తెర మరుగయ్యారనే చర్చ జిల్లా రాజకీయాల్లో హాట్ హాట్‌గా సాగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ కీలక నేత, ఎమ్మెల్సీ కవిత కూడా సభా నిర్వహణ విషయంలో కీలక పాత్ర పోషిస్తారని ఇంటర్నల్ సమావేశాల్లో కేసీఆర్ ఆదేశించారని గులాబీ శ్రేణుల్లో గుసగుసలు విన్పిస్తున్నా.. వాళ్లు కూడా ఇప్పటి వరకు వరంగల్ మొహంచూడలేదు. ఇక జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సభ ఏర్పాట్ల విషయంలో చుట్టపు చూపుగా మారిపోయారనే టాక్ వినిపిస్తోంది. అంతేగాక ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్లను సైతం ముఖ్య నేతలంతా ఎవరికి వారుగానే పరిశీలిస్తున్నారని, ఆయా నియోజ కవర్గాల్లోనూ సన్నాహక సమావేశాలుసైతం తూతూమంత్రంగానే కొనసాగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.**

# ఉద్యమకారుల గ్రామ కమిటీ ఎన్నిక




అక్షర దర్బార్,శాయంపేట : మండలంలోని మైలారం గ్రామ ఉద్యమకారుల గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్, ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుదిపాల జోగిరెడ్డి, ఉపాధ్యక్షుడు అరికిల్ల వీరయ్య, ప్రధాన కార్యదర్శులుగా గొర్రె కుమారస్వామి, దూదిపాల రాజిరెడ్డి, కోశాధికారి బొంతల నాగరాజు, కార్యవర్గ సభ్యులు దూది పాల రాంరెడ్డి, సొంటెడ్డి శంకర్, బొంతల సాంబయ్య, ఆకారపు ఐలయ్య, బొంతల భిక్షపతి ఎన్నికయ్యారు. కార్య క్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెబోయిన సారయ్య తదితరులు పాల్గొన్నారు.

### సోనియా, రాహుల్ గాంధీ పై

# ఈడీ కేసులను ఎత్తివేయాలి

**నర్సంపేట పట్టణ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి దేశి సాయి పటేల్**



అక్షర దర్బార్, నర్సంపేట : నేషనల్ హెరాల్డ్ కేసులో రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ నేతలు సోనియా రాహుల్ గాంధీపై పెట్టిన ఈడీ తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలని పట్టణ యువజన కాంగ్రెస్ కార్యదర్శి దేశి సాయికిరణ్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నర్సంపేట పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం చట్టం అతిక్రమించి కాంగ్రెస్ నేతలపై తప్పుడు కేసులు పెట్టి రాజకీయ కోణంలో లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు. తమ పార్టీకి చెందిన పత్రికలో తాము పెట్టుబడులు పెడితే మనీలాండరింగ్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు అమలు ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంతో రాహుల్ గాంధీకి వచ్చిన ప్రజాదరణ చూసి తట్టుకోలేక ఈడీ చార్జ్ షీట్ లో కాంగ్రెస్ అగ్ర నేతల పేర్లను చేర్చించి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతోందని విమర్శించారు.



# పాలకుర్తిలో బీఆర్ఎస్ కు షాక్

- కాంగ్రెస్ లో చేరనున్న తొర్రూరు మాజీ సర్పంచ్ రాజేష్ నాయక్
- అదే బాటలో డాక్టర్ పానుగోటి సోమేశ్వర రావు
- నమ్మిన బంట్లు ఒక్కొక్కరుగా ఎర్రబెల్లికి గుడ్ బై




అక్షర దర్బార్, తొర్రూరు: పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ కోటకు బీటలు వారుతున్నాయా?... గులాబీ పార్టీ కీలక నాయకులు పార్టీ మార బోతున్నారా?... మాజీ మంత్రి ఎర్రబెల్లికి కుడి భుజంగా ఉన్న నాయకులు కారు దిగుతున్నారా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య అనుచరులు, తొర్రూరు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ డాక్టర్ ధరావత్ రాజేష్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పానుగోటి సోమేశ్వర రావు పార్టీ మారేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. అతి త్వరలో కాంగ్రెస్ లో చేరేందుకు వారు నిర్ణయించు కున్నట్లు తెలిసింది. దీంతో పాలకుర్తి నియోజకవర్గంలో పాలిటిక్స్ కొత్త రూపు సంతరించుకోనుంది.

**ఒక్కొక్కరుగా కారు దిగి హస్తం వైపు..**

పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ కు ఆయువు పట్టుగా ఉన్న తొర్రూరులో ఒక్కొక్కరు కారు దిగి హస్తం పార్టీకి దగ్గరవుతున్నారు. ఇప్పుడు ఏకంగా మాజీ సర్పంచ్ రాజేష్ నాయక్, డాక్టర్ సోమేశ్వరరావులు బీఆర్ఎస్ ను వీడుతుండటం ఆ పార్టీలో కలకలం రేపుతోంది. పార్టీ మారుతున్న విషయం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి దయాకర్ రావు వారితో మాట్లాడి బుజ్జగించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. కానీ వారు బీఆర్ఎస్ లో కొనసాగేందుకు సుముఖంగా లేమని తేల్చినట్లు తెలుస్తోంది. డాక్టర్ రాజేష్ నాయక్ తొర్రూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా కొనసాగి దయాకర్ రావు ముఖ్య అనుచరునిగా పేరొందారు. ఆయన సహకారంతో దయాకర్ రావుకు గిరిజన, లంబాడా ప్రాంతాల్లో మంచి మద్దతు లభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్ డీ పూర్తి చేసిన రాజేష్ నాయక్ తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూ జేఏసీ చైర్మన్ గా వ్యవహరించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను రగిలించారు. ఎన్నో సామాజిక ఉద్యమాల్లో ప్రధాన భూమిక పోషించారు. తదనంతరం నవ తెలంగాణ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా సైతం కొనసాగారు. డాక్టర్ సోమేశ్వర రావు సైతం దయాకర్ రావుకు నమ్మిన బంటుగా రాజకీయాల్లో ఆయన వెన్ను తట్టారు. ప్రతి ఎన్నికల్లో దయాకర్ రావు గెలుపునకు కాలికి బలపం కట్టుకొని తిరిగి ప్రచారం చేశారు. గెలిచేంతవరకే నాయకులను దగ్గర ఉంచుకొని గెలిచాక ఆయనను పూర్తిగా విస్మరించారనే ప్రచారం ప్రజల్లో ఉంది. ఆయన స్థాయికి తగ్గ పదవీ, గౌరవం ఇవ్వలేదన్న భావన ప్రజల్లో ఉంది. అనామకులకు కీలక బాధ్యతలు, పదవులు అప్పగించిన మాజీ మంత్రి.. సోమేశ్వరరావుకు ఏ పదవి ఇవ్వడానికి ఇష్టపడ లేదనే ప్రచారం జరిగింది. గత కొంతకాలంగా డాక్టర్ రాజేష్ నాయక్, డాక్టర్ సోమేశ్వర రావులు బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఈ సమయంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలు వీరి ప్రాధాన్యతను గుర్తించి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే కాంగ్రెస్ పార్టీలో చేరికల పర్వం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ప్రజా బలం ఉన్న ఈ నాయకులతో హస్తం పార్టీకి లాభం చేకూరే అవకాశం ఉంటుందని స్థానిక నాయకులు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# పేదవాడి కడుపునింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

అక్షర దర్బార్, దుగ్గొండి : సన్నబియ్యం పేదోడికి అందించి పేదవాని కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శనివారం దుగ్గొండి మండలంలోని ముద్దునూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో చింత సురేష్ గృహంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంతో దళితులతో భోజన కార్యక్రమం చేపట్టగా మహబూబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, వరంగల్ కలెక్టర్ సత్యశారద దేవితో కలిసి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి భోజనం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సంధ్య రాణి,నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రవి చంద్రారెడ్డి, ఎంపీడీవో లెక్కల అరుంధతి ఎంపీడీవో, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



# భూభారతితో రైతాంగానికి మేలు

అక్షరదర్బార్, వరంగల్: భూభారతి తెలంగాణ రైతాంగానికి ఎంతో శుభ పరిణామం అని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూశాఖలో పట్టుగొమ్మలైన గ్రామస్థాయి ఉద్యోగులను చిన్నాభిన్నం చేసిందన్నారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం 10954 మంది గ్రామ పాలన అధికారులను తీసుకోనుండటం సంతోషకరం అన్నారు. ముందుగా పూర్వ గ్రామ రెవెన్యూ అధికారులను ఎలాంటి షరతులు లేకుండా తీసుకొని వారి పూర్వ సర్వీసును పరిగణనలోకి తీసుకొని పదోన్నతి కల్పించాలని కోరారు.

# ఆత్మీయ పలకరింపు



అక్షర దర్బార్, దుగ్గొండి : దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన నరహరి బుచ్చిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆత్మీయ పలకరింపులో భాగంగా నర్సంపేట సోషల్ థింకర్ ఫోరం ఆధ్వర్యంలో సభ్యులు బుచ్చిరెడ్డి యాది సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ థింకర్ ఫోరం సభ్యుడు డాక్టర్ వీఎం జయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మృతుడి చిన్ననాటి జ్ఞాపకాలను స్మరిస్తూ ఆయన యాదిలో మానవ సంబంధాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులు ఎవరైనా మరణిస్తే వారి బాధను పంచుకుంటూ వారి ఆరోగ్యాన్ని పరీక్షిస్తూ వారి కడుపు చల్ల కార్యక్రమాన్ని పండ్లు, ఫలాలు, పండ్ల రసాలు, మజ్జిగతో ఆత్మీయ పలకరింపులు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం అన్నారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులు నరహరి వీరారెడ్డి, నరహరి పద్మ నరహరి సంజయ్, శృతి, లక్ష్మిని పరామర్శించారు. కార్యక్రమంలో కాసుల రవికుమార్, ఇసాక్, మోతే ఇంద్రసేనారెడ్డి, పెండెం భాస్కర్, తిరుపతిరెడ్డి కూతురు వీరారెడ్డి , రాజేంద్ర ప్రసాద్, సాంబమూర్తి ,శివ లతోపాటు తదితరులు పాల్గొన్నారు

# పర్యావరణాన్ని పరిరక్షించాలి

**బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ రాజేంద్రప్రసాద్ రెడ్డి**

అక్షర దర్బార్, నర్సంపేట రూరల్ : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందని బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ అన్నారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ గత నవంబర్ లో నిర్వహించిన గ్రీన్ ఒలంపియాడ్ టెస్ట్ లో పాల్గొన్న బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొత్తం 183 మంది ఒలంపియాడ్ టెస్టులో పాల్గొనగా పదిమంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్ పొందగా, 173 మంది విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు పొందారు. వారందరికీ ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎం.డి. రియాజుద్దీన్, ప్రదీప్ చౌదరి, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ కు బాటలు వేసేది అధ్యాపకులే

## ప్రముఖ రచయిత గాయకుడు నెల్లుట్ల సుమన్

అక్షర దర్బార్,వరంగల్ : బంగారు భవిష్యత్ కు బాటలు వేసేది అధ్యాపకులేనని తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యుడు, ప్రముఖ రచయిత, గాయకుడు నెల్లుట్ల సుమన్ అన్నారు. శనివారం వరంగల్ పట్టణంలోని ఎల్బీ కాలేజీలో జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లుట్ల సుమన్ హాజరై మాట్లాడారు. యువత లక్ష్య సాధనకు గొప్ప సంకల్పాన్ని కలిగి ఉండాలని పాటల ద్వారా వివరించారు. ఇదే కాలేజీలో గత 18 సంవత్సరాల క్రితం చదువుకున్న నేను ఉద్యమ ఓనమాలు నేర్చుకొని తెలంగాణ సాంస్కృతి సారథిలో జాబ్ చేస్తూ యూట్యూబ్లో అద్భుతమైన పాటను అందిస్తూ మంచి అవకాశాలతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో సుమన్ ని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ అశోక్, కల్చరల్ కన్వీనర్ సతీష్, లెక్చరర్ మధు, నగేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






# పేషెంట్‌కు రూ.10 వేలు !

- 108 అంబులెన్స్ డ్రైవర్‌కు కమిషన్
- ప్రభుత్వ వైద్యులతో ప్రైవేట్ దవాఖానల కుమ్మక్కు !
- సర్కార్ దవాఖానలో ఆరుబయటే తూతూమంత్రంగా ప్రథమ చికిత్స
- రోగులను భయపెడుతూ ప్రైవేట్ హాస్పిటళ్లకు తరలింపు
- పరకాల ప్రభుత్వ ఆస్పత్రిలో నయా దందా
- ఠాగూర్ సినిమా సీన్లు ఇక్కడ నిత్యకృత్యం
- అధికారుల తీరుపై మండిపడుతున్న పేషెంట్ల బంధువులు



అక్షర దర్బార్, పరకాల : దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకున్నట్లు పరకాలలోని ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్లు, సిబ్బంది కుమ్మక్కై పేద, మధ్య తరగతి ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులను, వారి బంధువులను భయభ్రాంతులకు గురిచేస్తూ పథకం ప్రకారం ప్రైవేట్ దవాఖానలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాసులకు కక్కుర్తిపడుతూ బరితెగించి అమాయకులను నిండా ముంచుతున్నారు. వైద్య వృత్తికే కళంకం తీసుకొస్తున్నారు. 108 అంబులెన్స్ డ్రైవర్‌తో ఈ దందా సాగిస్తున్నారు. ఒక్కో పేషెంట్‌కు ప్రైవేట్ దవాఖానలు అంబులెన్స్ డ్రైవర్‌కు రూ. 10 వేలు కమిషన్ ఇస్తున్నట్లు సమాచారం. వచ్చిన కమిషన్‌లో ప్రభుత్వ దవాఖాన సిబ్బందికి వాటా పంచుతున్నట్లు రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే.. ఈ దందా మొత్తం ప్రభుత్వ దవాఖాన వైద్యుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఠాగూర్ సినిమాలోని సన్నివేశం పరకాల ప్రభుత్వ ఆస్పత్రిలో నిత్యకృత్యం అయిందనే టాక్ వినిపిస్తోంది.

### అసలేం జరిగింది..

ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే స్థోమతలేని అనేకమంది పేదలు పరకాలలోని ప్రభుత్వ దవాఖానకు నిత్యం ఎంతో మంది వస్తూ ఉంటారు. రోగుల పేదరికాన్ని, వారి కష్టాలను చూసి ఆసుపత్రి వైద్య సిబ్బంది మనసు ఏమాత్రం చలించడంలేదు. వారి నుంచి కూడా డబ్బులు దోచుకోవాలని పథకం పన్నారు. ఇంకేముంది.. పట్టణంలోని కొన్ని ప్రైవేట్ హాస్పిటళ్లతో కుమ్మక్కయ్యారు. ఇందుకు మధ్యవర్తి అవసరం ఉండటంతో 108 అంబులెన్స్ డ్రైవర్‌ను రంగంలోకి దింపారు. 108 అంబులెన్స్ డ్రైవర్‌కు మరికొన్ని ప్రైవేట్ అంబులెన్స్‌లు ఉండగా ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినా, మరేదైనా అత్యవసర పరిస్థితుల్లో పేషంట్ల నుండి ఫోన్ రావడంతో వెంటనే 108 అంబులెన్స్‌తో అక్కడికి వెళ్లి బాధితులను పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొస్తున్నాడు. దవాఖాన బయటనే ప్రథమ చికిత్స చేయించడం, పేషెంట్లను భయభ్రాంతులకు గురిచేయడం పరిపాటిగా మారింది. వెంటనే రోగిని చికిత్స కోసం ఏదైనా ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని, లేకపోతే పేషెంట్ ప్రాణాలకే ప్రమాదం అని బెదిరిస్తున్నారు. దీంతో సదరు 108 అంబులెన్స్ డ్రైవరే తనకు చెందిన మరో ప్రైవేట్ అంబులెన్స్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇదంతా చేసినందుకుగాను అంబులెన్స్ డ్రైవర్‌కు ఒక్కో పేషెంట్ కు ప్రైవేట్ హాస్పిటల్ యజమాన్యం రూ. 10 వేల పైచిలుకు కమిషన్ ఇస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందులో ప్రభుత్వ దవాఖాన సిబ్బందికి కూడా వాటా ఇస్తున్నట్లుగా టాక్ వినిపిస్తోంది.

### వద్దని వారించినా..

రేగొండ మండలానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురవడంతో శనివారం హుటాహుటిన 108 అంబులెన్స్ ఆ మండలానికి చేరుకొని బాధితుడిని పరకాల ప్రభుత్వ హాస్పిటల్ తరలించింది. వెంటనే అక్కడున్న ప్రభుత్వ వైద్యుడు ఆ పేషెంట్‌కు సిబ్బందితో ప్రథమ చికిత్స అందించి అక్కడ నుండి బయటకు వెళ్లారు. వెంటనే 108 అంబులెన్స్ డ్రైవర్ రంగంలోకి దిగి పేషెంట్‌తోపాటు ఆయన వెంట ఉన్న మరో వ్యక్తితో మాట్లాడారు. క్షతగాత్రుడిని వెంటనే ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకు పోకుంటే ప్రాణాలకు ప్రమాదమని భయాందోళనకు గురిచేశాడు. పేషెంట్ ముందే చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో పడిపోయారు. పేషెంట్ బంధువు ప్రైవేట్ హాస్పిటల్‌కి వద్దని వారించినా వినకుండా ఆలస్యం చేస్తే చనిపోతాడని బెదిరించి 108 అంబులెన్స్ డ్రైవర్ అక్కడి నుండి ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో పట్టణంలోని మరో ప్రైవేట్ దవాఖానకు తరలించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. సిబ్బంది సహకారంతోనే 108 అంబులెన్స్ డ్రైవర్ నిత్యం ఈ దందా నడుపుతున్నట్లు రోగులు బంధువులు ఆరోపిస్తున్నారు.

**బాధాకరం..**

**108 అంబులెన్స్ డ్రైవర్ అరాచకాలపై అక్షరదర్బార్ పరకాల ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ గౌతమ్ చౌహాన్‌ను వివరణ కోరింది. తమ దవాఖానలో ప్రైవేట్ అంబులెన్స్ ఉండొద్దని ఇంతకు ముందు చెప్పామని, అయినా అంబులెన్స్ రావడం బాధాకరమని అన్నారు. పేషెంట్లను ప్రైవేట్ హాస్పిటల్ కాకుండా ఎంజీఎంకు తరలించాలని చెప్పినప్పటికీ వినడంలేదన్నారు. అసలు బయట ఏం జరుగుతుందో తమకు తెలియదని అన్నారు.**

**- సూపరింటెండెంట్, గౌతమ్ చౌహాన్**

# 22న ఇంటర్ రిజల్ట్స్



అక్షరదర్బార్, హైదరాబాద్: ఈనెల 22న ఇంటర్ ఫలితాలు వెలువడనున్నాయి. మొదటి సంవత్సరం, సెకండియర్ ఫలితాలను ఒకేసారి ప్రకటించనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. మంగళవారం (ఏప్రిల్ 22) మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫలితాలను విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. విద్యార్థులు ఇంటర్మీడియట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ tsbie.cgg.gov.in లేదా results.cgg.gov.inలో చూసుకోవచ్చు. మార్చి 5 నుంచి 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా 1532 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 9,96,971 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 4.88 లక్షల మంది ఫస్టియర్ విద్యార్థులు ఉండగా, 5 లక్షలకుపైగా సెకండియర్ విద్యార్థులు ఉన్నారు. మార్చి 18 నుంచి సమాధాన పత్రాల మూల్యాంకనం చేశారు.

# పోషణ లోపం లేని సమాజాన్ని నిర్మిద్దాం..

### జిల్లా సంక్షేమ అధికారి జెట్టి జయంతి

### నర్సక్కపల్లిలో 7 వ రాష్ట్రీయ పోషణ పక్షం..

అక్షర దర్బార్, పరకాల : పరకాల సిడిపిఓ స్వాతి అధ్యక్షతన శనివారం పరకాల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో నడికూడ మండలంలోని నర్సక్క పల్లి గ్రామంలో జాతీయ పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి జెట్టి జయంతి పాల్గొని మాట్లాడుతూ.. పోషణ పక్షంలో భాగంగా ఏప్రిల్ 8 నుండి 22 వరకు ప్రతి గ్రామంలో పోషణ కార్యక్రమాలు నిర్వహించి పోషణ లోపం లేని సమాజం నిర్మించేలా కృషి చేయాలన్నారు. అంగన్వాడి పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి, నడికూడ తహసిల్దార్ నాగరాజు, నడికూడ మండల వైద్యాధికారి కే దివ్య, ఎంపీడీఓ విమల, సఖి అడ్మిన్ హైమావతి, పోషణ అభియాన్ డిస్టిక్ కో ఆర్డినేటర్ సుమలత, డి హెచ్ ఈ డబ్ల్యు కో ఆర్డినేటర్ కళ్యాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు శ్రీదేవి, హేమలత, పుణ్యవతి, రోజా రాణి, మంజుల, సునీత, రాణి, నజీమ పర్వీన్, ఉమాదేవి, భిక్షపతి, విజయకుమార్ పాల్గొన్నారు.





# తల్లిదండ్రులను గౌరవించాలి

అక్షర దర్బార్, చిట్యాల : జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌరవిస్తూ ఇతరుల పట్ల మర్యాదగా మెదిలేవారు జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారని ఎలేటిరామాయపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారం తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాఠశాల చైర్మన్ ఉమ హాజరై మాట్లాడుతూ ఎంత సేవ చేసినా తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిదని, గురువుల పట్ల గౌరవ మర్యాదలు కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చక్రపాణి ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆ 2 వేల మందికీ నోటీసులిస్తారా ?

**కంచ గచ్చిబౌలి ఇష్యూ రీట్వీట్‌పై స్మితా సబర్వాల్**

అక్షరదర్బార్, హైదరాబాద్: 'హాయ్ హైదరాబాద్' ట్వీట్‌ను తాను రీట్వీట్ చేశానని, తనలాగే మరో 2 వేల మంది కూడా దానిని రీట్వీట్ చేశారని ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ గుర్తుచేశారు. తనకు పంపినట్లే మిగతా 2 వేలమందికి కూడా నోటీసులు పంపించారా..? అని నిలదీశారు. వారందరిపైనా ఇలాంటి చర్యలే తీసుకున్నారా అని అడిగారు. చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందా లేక ఈ విషయంలో కొందరిని మాత్రమే ఎంపిక చేసి వారినే టార్గెట్ చేస్తున్నారా అని పోలీసులను నిలదీశారు. కంచ గచ్చిబౌలి భూముల్లో జంతువులు ఉన్నాయంటూ ఇటీవల ఏఐ ఫొటోతో ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. 'హాయ్ హైదారాబాద్' అనే ట్విట్టర్ యూజర్ ఓ ఏఐ ఫొటోను ట్వీట్ చేయగా.. ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ రీట్వీట్ చేశారు. ఈ వ్యవహారంపై గచ్చిబౌలి పోలీసులు ఆమెకు నోటీసులు పంపించి విచారణకు పిలిచిన సంగతి తెలిసిందే. తొలుత ఈ నోటీసులకు స్పందించని స్మితా సబర్వాల్.. ఆ తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరిన్ని ట్వీట్లు చేశారు. తాజాగా శనివారం ఈ వివాదంపై స్మితా సబర్వాల్ స్పందించారు.



# పీడీఎస్ బియ్యం పట్టివేత..

అక్షర దర్బార్, పరకాల : హనుమకొండ జిల్లా దామెర పోలీస్ స్టేషన్ పరిధిలో దామెర ఎస్సై కొంక అశోక్ వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రెండు ఆటోలు పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకోనీ, చూడగా అందులో ప్రభుత్వ ప్రజా పంపిణీ బియ్యం కలిగి ఉన్నారు. వెంటనే వారిని విచారించగా హసన్ పర్తి మండలం జయగిరి కి చెందిన వల్లెపు జంపయ్య, సాయిలు దామెర లోని పలువురు లబ్ధిదారుల నుంచి దొడ్డు బియ్యాన్ని కొనుగోలు చేసి హనుమకొండకు తీసుకెళ్తున్నామని తెలిపారు. వెంటనే వారి తో పాటు రెండు ఆటోలను, 4 క్వింటాళ్ల 50 కిలోల రేషన్ దొడ్డు బియ్యంను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.



## అమ్మను స్మరిస్తూ..

# ప్రజా సేవలో తరిస్తూ..

- మాతృమూర్తి యాదిలో అమ్మా నాన్న ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు
- పలు సామాజిక కార్యక్రమాలు చేస్తున్న గంజి శ్రీనివాస్ రెడ్డి
- వ్యవసాయ క్షేత్రంలో తల్లి విగ్రహంతో పాటూ.. స్మృతివనం ఏర్పాటు



పదో తరగతి విద్యార్థులకు డిక్షనరీలను అందిస్తూ..



గ్రామస్తులకు మామిడికాయలు అందజేస్తున్న శ్రీనివాస్ రెడ్డి

అక్షర దర్బార్, ఇనుగుర్తి: తల్లితండ్రులు బ్రతికున్నప్పుడు సేవ చేసుడే భారం అవుతున్న ఈ రోజుల్లో.. తన తల్లి చనిపోయినా ఆమె బ్రతికున్నప్పుడు చెప్పిన మాటలనే శిరోధార్యంగా చేసుకుని ఆమె పేరుతో చారిటీ స్థాపించి పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ.. నిరుపేదలకు చేదోడు వాదోడుగా ఉంటూ సేవ ద్వారా సమాజంలో తన తల్లిపేరును సజీవంగా ఉంచుతున్నాడు ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన గంజి శ్రీనివాస్ రెడ్డి. వివరాల్లోకి వెళితే.. గంజి శ్రీనివాస్ రెడ్డి తల్లి గంజి ఉపేంద్రమ్మ 2020 సంవత్సరంలో అకస్మాత్తుగా మరణించగా.. నాటి నుండి తండ్రి ముకుందా రెడ్డి, సోదరుడు కృష్ణారెడ్డి సహకారంతో గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. పలువురి ప్రశంసలు పొందుతూ ఉన్నాడు. గ్రామంలో 2021లో కుటుంబ సభ్యుల సహకారంతో "అమ్మా నాన్న ఛారిటబుల్ ట్రస్ట్" ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, అంగన్ వాడీ సిబ్బంది, పలు సామాజిక కార్యకర్తలకు కరోనా వారియర్లుగా గుర్తించి ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ జవాన్లను ఘనంగా సన్మానించి గ్రామంలోని పేద విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీలను అందించారు. అంతేగాక ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళ స్నాక్స్ అందించారు. ఈ క్రమంలోనే శనివారం నెక్కొండ రోడ్డులో శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో అమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించి, ఆ స్థలంలోనే 50కి పైగా మామిడి మొక్కలను నాటించారు. వాటి ద్వారా వచ్చిన మామిడి కాయలను ప్రతీ సంవత్సరం గ్రామస్తులకు ఉచితంగా పంపిణీ చేస్తూ వస్తున్నారు. అదే విధంగా శనివారం కూడా దాదాపు 3 వేలకుపైగా కాయలను గ్రామస్తులకు అందజేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్ లో ఇనుగుర్తి గ్రామ ప్రజలు, సన్నిహితుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని "అక్షర దర్బార్" ప్రతినిధితో గంజి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# సురేఖ భరోసా..

- ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి
- సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశం



అక్షరదర్బార్, హన్మకొండ : ప్రజా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారం చూపడం ప్రజా ప్రభుత్వం పాలనకు నిదర్శనమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం మంత్రి కొండా సురేఖ హనుమకొండ రాంనగర్‌లోని నివాసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు సమస్యలను మంత్రి కొండా సురేఖకి విన్నవించారు. వారి సాధకబాధకాలను మంత్రి కొండా సురేఖ సహృదయంతో విని సంబంధిత పలువురు అధికారులతో అప్పటికప్పుడే ఫోన్లో మాట్లాడి పరిష్కరించారు. సులువుగా పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను మంత్రి సురేఖ మందలించారు. మరోసారి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలకు వెనకాడనని మంత్రి సురేఖ వారికి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఏ సమస్యలున్నా ప్రజలు తనను సంప్రదించవచ్చునని స్పష్టం చేశారు. అధికారుల నుంచి సరైన స్పందన లేనిపక్షంలో తనకు తెలియజేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. అధైర్యపడవలసిన అవసరం లేదని, బడుగు, బలహీన వర్గాలజీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నదని మంత్రి కొండా సురేఖ భరోసానిచ్చారు.



## జనగామ జిల్లాలో

# లారీ బీభత్సం

- మద్యం మత్తులో డ్రైవర్
- టోల్‌గేట్ క్యాబిన్ లోకి దూసుకెళ్లడంతో ధ్వంసం

అక్షరదర్బార్, జనగామ: జిల్లాలోని రఘునాథపల్లి మండల పరిధిలో లారీ బీభత్సం సృష్టించింది. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై కోమల్ల టోల్‌గేట్ వద్ద అదుపు తప్పిన లారీ ఒక్కసారిగా టోల్‌గేట్ క్యాబిన్‌వైపు దూసుకువచ్చింది. ఈ ప్రమాదంలో క్యాబిన్ పూర్తిగా ధ్వంసం కాగా.. సిబ్బంది గాయపడ్డాడు. స్థానికులు దవాఖానకు తరలి ంచారు. ప్రమాదంలో మరో కారు ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండటమే ప్రమాదానికి కారణంగా గుర్తించారు. టోల్‌గేట్ నిర్వహకుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

# పొంగులేటికి తప్పిన ప్రమాదం

**హెలిప్యాడ్ సమీపంలో మంటలు**

**అదుపుచేసిన ఫైర్ సిబ్బంది**

అక్షరదర్బార్, నాగర్‌కర్నూల్: భూభారతి చట్టం అవగాహన సదస్సు కోసం నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ల్యాండ్ అవుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెలికాప్టర్కు ప్రమాదం తప్పింది. హెలిప్యాడ్ సమీపంలో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన పోలీసులు మంటలను అదుపు చేశారు. హెలికాప్టర్ కలెక్టరేట్ ప్రాంగణంలో ల్యాండింగ్ చేస్తున్న క్రమంలో సిగ్నల్ కోసం బుల్లెట్ ఫైర్ చేయడంతో పక్కనే ఉన్న ఎండు గడ్డిలో నిప్పు చెలరేగింది. దీంతో 2 మీటర్ల మేర మంటలు వ్యాపించాయి.

# భూభారతితో సమస్యలు పరిష్కారం

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని**




అక్షరదర్బార్, హనుమకొండ: నూతన భూభారతి చట్టం ద్వారా భూసమస్యలు పరిష్కారమవుతాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వడ్డేపల్లి సమీపంలోని వీ ఆర్ బాంక్వెట్ హాల్‌లో హనుమకొండ మండల స్థాయి భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందన్నారు. రైతులకు భూభారతి చట్టంలో సమస్యలు, అభ్యంతరాలు తెలియజేసే అవకాశం కల్పించిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా భూభారతి చట్టంలోని అంశాలను ముద్రించిన గోడప్రతులను ఆవిష్కరించారు. రైతులు జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను శాలువాతో సత్కరించారు.

# హరీష్‌రావు కంటతడి

**తండ్రి చనిపోయిన విద్యార్థిని వేదనకు చలించిన మాజీ మంత్రి**



అక్షరదర్బార్, సిద్దిపేట: సిద్దిపేట పట్టణంలోని మెట్రో గార్డెన్‌లో 'భద్రంగా ఉండాలి.. భవిష్యత్‌లో ఎదగాలి' అనే అంశంపై స్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పాల్గొన్నారు. అవగాహన సదస్సులో తండ్రిని కోల్పోయి బిడ్డ చదువు కోసం తల్లి పడుతున్న కష్టాలను విద్యార్థులు పంచుకున్నారు. తమ చదువు కోసం పేరెంట్స్ పడుతున్న కష్టాలను గుర్తించి, తాము చదువు కోసం తపిస్తున్న పేరెంట్స్‌ను ఇబ్బంది పెడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రిని కోల్పోయి, బిడ్డ చదువు కోసం తల్లి పడుతున్న కష్టాన్ని కంటతడి పెట్టుకుంటూ ఓ విద్యార్థిని వెల్లడించింది. విద్యార్థిని వేదన విని హరీష్‌రావు కంటతడి పెట్టారు. ఆ విద్యార్థిని దగ్గరకు తీసుకుని హరీష్‌రావు ఓదార్చారు. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది.

# కాషాయ సైనికుడు ఛత్రపతి వారసుడు



అతడు కరడుగట్టిన కాషాయ సైనికుడు. ఛత్రపతి శివాజీ వారసుడు. చిన్నతనం నుంచే జాతీయ భావాలు, దేశభక్తిని అలవర్చుకున్నారు. బీజేపీ సిద్ధాంతాలను నరనరాన జీర్ణించుకున్నారు. ఏబీవీపీతో ప్రస్థానం ప్రారంభించి, బీజేవైఎంలో కీలక నేతగా ఎదిగారు. ప్రస్తుతం హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు శాయంపేట మండలం వసంతాపూర్ గ్రామానికి చెందిన లాడె శివ (చిరంజీవి). పార్టీ కార్యక్రమాలను నేనుసైతం అంటూ ముందుకు తీసుకుపోతున్నారు. అనతికాలంలోనే అగ్రనేతల దృష్టిని ఆకర్షించారు. ఇక రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఉవ్విల్లూరుతున్నారు. పార్టీ ఆదేశిస్తే శాయంపేట మండలం నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు రెడీగా ఉన్నారు. యూత్ ఫాలోయింగ్ కూడా ఉండటంతో చాపకింద నీరులా గ్రౌండ్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామగ్రామాన ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రుల పరిచయాలతోపాటు నాలుగు వేల పైచిలుకు సామాజికవర్గం ఓట్లతో విజయం సాధించి కాషాయం జెండాను రెపరెపలాడిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు శివ.

- అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

- సవాళ్లను ధిక్కరిస్తూ ఒక్కో మెట్టు..
- ఏబీవీపీ, బీజేవైఎంలో క్రియాశీలక పాత్ర
- పార్టీ అగ్రనేతలతోనూ సన్నిహిత సంబంధాలు



- నగరంలో ప్రముఖ విద్యాసంస్థల్లో భాగస్వామి..
- సామాజిక సేవలోనూ హన్మకొండ జిల్లా
- బీజేవైఎం ప్రధాన కార్యదర్శి లాడె శివ ముందంజ
- నిరుపేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూత
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై గురి
- శాయంపేట నుంచి జెడ్పీటీసీగా బరిలోకి దిగేందుకు రెడీ
- మండలంలో మెండుగా యూత్ ఫాలోయింగ్ ..
- టికెట్ ఇస్తే కమలం జెండా ఎగురవేస్తానని ధీమా..
- కలిసిరానున్న ఆరె సమాజికవర్గం ఓటు బ్యాంక్

## సొంతూరు వసంతాపూర్..

లాడె శివ (చిరంజీవి) స్వగ్రామం హన్మకొండ జిల్లా శాయంపేట మండలం వసంతాపూర్. తల్లిదండ్రులు రాములు - వినోద. భార్య ప్రీతి, కూతురు సుదిక్ష. సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబం. గంగిరేణిగూడెం జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి వరకు చదివారు. హన్మకొండలోని విద్యాన్ కళాశాలలో ఇంటర్, మాస్టర్ జీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. అల్లూరి ఇన్‌స్టిట్యూట్‌లో పీజీ (ఎంబీఏ) కంప్లీట్ చేశారు. విద్యార్థి దశ నుంచే జాతీయ భావాలు అలవర్చుకున్న శివ బీజేపీ సిద్ధాంతాలవైపు ఆకర్షితులయ్యారు. ఏబీవీపీ, బీజేవైఎం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అంచెలంచెలుగా ఎదిగారు. 2013 నుంచి 17 వరకు విద్యార్థి సంఘంలో కీలకంగా పనిచేశారు. ఓరుగల్లు కేంద్రంగా జరిగిన పలు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడారు. పదేండ్ల కాలంలో పార్టీలోని జిల్లా, రాష్ట్ర నేతల మన్ననలు పొందారు. ప్రస్తుతం హన్మకొండ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న శివ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ యంగ్ లీడర్‌గా గుర్తింపు దక్కించుకున్నారు.








## సామాజిక బాధ్యతగా..

ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత వందలో ఒకడిగా ఏదో ఓ ఉద్యోగంలో సెటిలైపోవాలని అనుకోలేదు. వ్యాపారంలో నిలదొక్కుకోవాలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని సంకల్పించాడు. ఫైనల్‌గా తన లక్ష్యమైన రాజకీయాల్లో రాణించాలనుకున్నాడు. ఇందుకోసం అవరోధాలు ఎదురైనా, కుటుంబ ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా మారినా.. భయపడలేదు. వెనుకంజ వేయలేదు. పట్టుదలతో ఒక్కో మెట్టూ ఎక్కుకుంటూ ముందుకు సాగుతున్నాడు. ఈక్రమంలోనే హన్మకొండలో 8 సంవత్సరాల క్రితం శ్రీచైతన్య డిగ్రీ కళాశాల, 2024లో మిత్రులతో కలిసి ఇన్‌స్పైర్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. పేదరికం విలువ తెలిసిన, విద్యార్థుల కష్టం స్వయంగా అనుభవించిన శివ సామాజిక బాధ్యతను మరిచిపోలేదు. తమ విద్యాసంస్థల్లోని పలువురు పేద పిల్లలకు ఫీజులోనూ కొంత రాయితీ కల్పిస్తూ వారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. మరోపక్క తన ఆరె సామాజికవర్గంలోనూ లాడె శివ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆరె విద్యావంతుల వేదిక హన్మకొండ జిల్లా సెక్రటరీగా కొనసాగుతున్నారు. కులంలోని పేద కుటుంబాల బిడ్డలకు విద్యాపరంగా తనవంతు చేయూతనందిస్తూ మన్ననలు పొందుతున్నారు. విద్యాపరంగా, సామాజికపరంగా, రాజకీయపరంగా ఉనికి చాటుకుంటూ రాజకీయాల్లో రాణించేలా వ్యూహాత్మకతంగా ముందుకుసాగుతున్నారు.



## టికెట్ ఇస్తే గెలుస్తా..

శాయంపేట జెడ్పీటీసీగా అవకాశం వస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నా. గతంలో శాయంపేట మండల బీజేవైఎం అధ్యక్షుడిగా చురుగ్గా పనిచేసిన అనుభవం ఉన్నది. ఆ అనుభవాన్ని గుర్తించే జిల్లా నాయకత్వం బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా నియమించింది. మండలంలోని పలు గ్రామాల్లో మృతిచెందిన కుటుంబాలను పరామర్శించి వారికి ఆర్థికసాయం చేస్తున్నా. మండలంలోని అన్ని పార్టీల నాయకుల తోనూ సత్సంబంధాలు ఉన్న యువ నాయకుడిగా పేరుంది. యూత్‌లోనూ క్రేజ్ ఉంది. అంతేగాక ఆరే కుల సంఘంతో మంచి అనుబంధం ఉన్నది. శాయంపేట మండలంలో సుమారు 4 వేల పైచిలుకు ఉన్న తన సామాజికవర్గం ఓట్లు కలిసి వచ్చే అవకాశం ఉంది. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నేతలతో సాన్నిహిత్యం మరింత ఉపయోగపడనుంది.

